
PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

కార్పొరేషన్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి


3లో

దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 312 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 05 నవంబర్ 2026



తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

- దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుంది

హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర మరువలేనిది

శ్రీకృష్ణ సదర్ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలి: బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్





హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మిగతా2లో...

తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

డీప్‌టెక్ రంగంలో ప్రపంచస్థాయి కేంద్రంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం.. పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరగాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.రాష్ట్రంలో ఐటీ, ఔషధాలు, జీవసాంకేతికత, మిగతా2లో...

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

చట్టం అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!


పర్యవేక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచన.. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చర్యలు


2లో

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

ఇరాన్ హర్షం.. రష్యా ఆచితూచి వ్యాఖ్యలు.. అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తామన్న చైనా


2లో


2లో

పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

వరద సహాయక చర్యల్లో విషాదం..

11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు!

మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి బేతపల్లి చెరువు అలుగు వద్ద బోట్లు బోల్తా



సత్తుపల్లి,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతపల్లి పెద్ద చెరువు వద్ద బుధవారం విషాదం చోటుచేసు కుంది. వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు బోట్లు బోల్తా పడటంతో తమ్మిలేరు వాగులో గల్లంతయ్యారు.చెరువు అలుగు వద్ద ఏడుగురు మత్స్యకారులు వరద ఉధృతికి చిక్కుకోగా, వారిని కాపాడేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కలెక్టర్ దివాకర టీఎస్ మిగతా2లో...

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్నారు
- రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్, బీజేపీల ప్రాధాన్యం
- రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి.. కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): ఢిల్లీ పార్టీలతో తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరగబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు కాంగ్రెస్, బీజేపీలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోందని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అవుకు దామోదర్‌రెడ్డి మిగతా2లో...

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

ఢిల్లీ నిరసన సభకు గైర్హాజరైన నేతలపై ఆగ్రహం.. తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై వివరణ కోరిన ఏఐసీసీ

హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): ఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోరీ వ్యతిరేక నిరసన సభకు గైర్హాజరైన తెలంగాణ కాంగ్రెస్ నేతల వ్యవహారంపై ఏఐసీసీ తీవ్రంగా స్పందించింది. అధిష్టానం ఆదేశించిన కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆదేశించింది.ఈ నెల 1న ఢిల్లీలోని మిగతా2లో...

తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తోందని తెలిపారు.**హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం** హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర వెలకట్టలేనిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని గుర్తుచేశారు. ప్రస్తుతం గోల్కొండ కోట ఉన్న ప్రాంతం ఒకప్పుడు గొల్లం కొండగా ప్రసిద్ధి చెందిందని ప్రస్తావించారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. నగర అభివృద్ధిలో వారి సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు.**సదర్ ఉత్సవాలకు రూ.5 కోట్ల కేటాయింపు**సదర్ వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించిందని సీఎం వెల్లడించారు. మూసీ పునరుద్ధరణ, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు.**పశుసంపదతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. సదర్ ఉత్సవాల ద్వారా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయమవుతున్నాయని పేర్కొన్నారు. యాదవులు ఆర్థిక వ్యవస్థలో మరింత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.**జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి**బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సామాజిక న్యాయం సాధించేందుకు జనాభా గణాంకాలు కీలకమని పేర్కొన్నారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. సదర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టడంతో ఆయనకు ఢిల్లీలో ఉన్న గౌరవం ఏమిటో అర్థమైందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి అని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలతోనే పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కంటే చిన్నవాడైన అమిత్‌షా కాళ్లకు నమస్కరించాల్సిన పరిస్థితి రావడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిగజార్చడమేనని అన్నారు. అమిత్‌షా పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ బౌన్సర్‌లా వ్యవహరించారని విమర్శించారు. అమిత్‌షా తెలంగాణకు ఉత్త చేతులతో వచ్చి వెళ్లారని, రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా జాతీయ స్థాయి విద్యాసంస్థను తీసుకురాలేదని ప్రశ్నించారు.**ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం**కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టిందని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై పగబట్టిందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. హైదరాబాద్‌లో మళ్లీ తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని గుర్తుచేస్తూ.. రేవంత్‌రెడ్డి ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప పాలనపై సీఎం దృష్టి పెట్టడం లేదన్నారు.**మియాపూర్ భూముల విక్రయంపై ప్రశ్నలు** మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూముల విక్రయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అంత తొందర ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. తీర్పు వచ్చిన 24 గంటల్లోనే భూములు అమ్మేస్తామని సీఎం ప్రకటించడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మియాపూర్ భూముల్లో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, హైదరాబాద్‌లోని పేదలకు స్థలాలు కేటాయించాలని కోరారు. హిల్ట్ పాలసీ పేరుతో కమీషన్ల వ్యవహారానికి తెరలేపారని, పరిశ్రమల కోసం కేటాయించిన విలువైన భూములను ప్రైవేటు ప్రయోజనాల కోసం విక్రయించడం దారుణమని విమర్శించారు.**విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు** కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, జనరేటర్లు, ఇన్వర్టర్ల అవసరం తగ్గిపోయిందని కేటీఆర్ అన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం

పెట్టుబడులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ మంత్రిమండలి సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు మంత్రులతో సీఎం అనధికా రికంగా సమావేశం కానున్నారు. ప్రధానంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చి ంచనున్నట్లు సమాచారం. వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలు, పరిశ్రమలకు భూకేటాయిం పులు, కొత్త ప్రాజెక్టులకు అనుమతుల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితు లు, వ్యవసాయంపై ప్రభావం, తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలపైనా మంత్రిమండలి సమీక్షించను న్నట్లు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథ కాల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, పరిపాలనాపరమైన అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకోనుంది. సమావేశంలో వెలువడే నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

కొడంగల్‌లో రైతు పండుగ.. మూడు రోజుల పాటు


మెగా రైతు మేళా!

- **నవంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహణ.. 150 ప్రదర్శన స్టాళ్లు..**

చివరి రోజు 50 వేల మంది రైతుల హాజరు



హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను పరిచయం చేసేందుకు కొడంగల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నవంబర్ 7న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేళాను ప్రారంభించనున్నారు.**150 ప్రదర్శన స్టాళ్ల ఏర్పాటు** మేళాలో 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు.**ఎల్‌నినో ప్రభావంపై అవగాహన** ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. మొదటి రోజు సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, డ్రిప్ పరికరాలు అందించనున్నారు.రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.



రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే!

- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో వచ్చే ఏడాదిలోగా సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.భూముల రీ సర్వేను రైతుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూమి హద్దులు, విస్తీర్ణంలో తేడాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి భూ యజమానికి పక్కా వివరాలతో కూడిన భూ రికార్డులు, కొత్త పాస్‌బుక్కులు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు వారానికోసారి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

న్యూఢిల్లీ,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): బాల కార్మికుల నిషేధ చట్టం అమలును మరింత కఠినతరం చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం2016 అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సూచించింది.జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్లలోపు పిల్లలను అన్ని రకాల వృత్తులు, పనుల్లో నియమించడాన్ని నిషేధించే ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొంది.

2009 నాటి పిటిషన్‌పై విచారణ బాల కార్మికుల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ 'హెల్ప్ ఫర్ మిలియన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2009లో పిటిషన్ దాఖలు చేసింది. పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం కల్పించాలని కూడా కోరింది. 2016లో చట్ట సవరణతో పిటిషనర్ లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యాయని కేంద్రం కోర్టుకు తెలిపింది. దీంతో పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం, సవరించిన చట్ట నిబంధనలను మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.

వరద సహాయక చర్యల్లో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.**సహాయక చర్యలపై సీఎం ఆరా** ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

న్యూఢిల్లీ,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమిపై ప్రపంచ దేశాల నేతలు స్పందించారు. డెమోక్రాట్లు విజయం సాధించడాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ స్వాగతించారు. ట్రంప్ విధానాలకు అమెరికా ప్రజలు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని వ్యాఖ్యానించారు.అమెరికా ఓటర్లు యుద్ధాన్ని తిరస్కరించారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ గాలిబఫ్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఫలితాలతో అమెరికా విదేశాంగ విధానంలో తక్షణ మార్పులు వస్తాయని భావించలేమని రష్యా తెలిపింది.డెమోక్రాట్ల విజయం ఉక్రెయిన్‌కు మద్దతు, పర్యావరణ పరిరక్షణకు మేలు చేయవచ్చని యూరోపియన్ యూనియన్ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఎన్నికలు ఆ దేశ అంతర్గత వ్యవహారమని చైనా పేర్కొంది. జపాన్, బ్రిటన్ కూడా అమెరికాతో తమ సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి.

పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

- పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

అమరావతి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):
జాతీయ పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరీక్షల సంస్కరణల ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని చర్చించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా విధానం రూపొందించాలని చంద్రబాబు సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేలా విద్యా సంస్కరణలు ఉండాలన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని వివరించారు. పేపర్ లీకేజీల నివారణ, సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్ బలోపేతంపై దృష్టి సారించినట్లు నీలేకని తెలిపారు.

తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

అంతరిక్ష, విమానయాన రంగాలకు బలమైన పునాది ఉందని పేర్కొన్నారు. పరిశోధనశాలలకే పరిమితమవుతున్న ఆవిష్కరణలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా విజయవంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృత స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ రంగాల్లో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. **సాంకేతికతతో యువతకు ఉపాధి అవకాశాలు** సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా దేశీయంగా ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. యువతకు నైపుణ్య శిక్షణ, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఫిక్కీ వందేళ్ల ప్రస్థానాన్ని అభినందించిన భట్టి విక్రమార్క, రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

(మొదటి పేజీ తరువాయి)

రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు తరలివెళ్లారు. అయితే మొత్తం 13 మంది ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరైనట్లు టీపీసీసీ గుర్తించింది. వారిలో నలుగురు వ్యక్తిగత, కుటుంబ కారణాలతో ముందస్తు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన తొమ్మిది మంది ఎందుకు హాజరుకాలేదో వివరించాలని ఏఐసీసీ కోరింది. గైర్హాజరైన వారిలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధిష్టానం స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో పంట నష్టం

వెంటనే సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలి: మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలు, మురుసు తుఫాను ప్రభావం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని ప్రకటించాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి చేశారు. నవంబర్ 4, 2026 నాటి వర్షపాత నమోదు లెక్కల ప్రకారం సత్తుపల్లి నియోజకవర్గం భారీ వర్షపాతం 200 మి.మీ పైగా నమోదైందనీ అన్నారు.రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలలో ఇదీ ఒకటిగా నిలిచిందని, దీనివల్ల నియోజకవర్గంలో అపారమైన పంట నష్టం వాటిల్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రధానంగా వరి సాగు అత్యధిక విస్తీర్ణంలో జరుగుతుంది. ప్రస్తుతం వరి కోత దశకు వచ్చిన తరుణంలో భారీ వర్షాలకు పొలాలు నీట మునిగి, పంట పూర్తిగా వంగిపోయింది. చేతికి రావాల్సిన పంట నీట మునగడంతో పాటు పొలాల్లో నడుములోతు నీరు నిలిచిపోయింది. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో సతమత మవుతున్న వరి రైతులకు, ఈ మురుసు తుఫాను మరింత కోలుకోలేని దెబ్బతీసింది అని అన్నారు.వరితో పాటు పత్తి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు. తీత దశలో ఉన్న పత్తి వర్షపు నీటిలో తడిచి ముద్దయి దిగుబడి పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేసి, సత్తుపల్లి నియోజకవర్గంలో వరి, ఇతర సాగు పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి తక్షణమే సర్వే చేపట్టాలని, సర్వే నివేదికలను వెంటనే ప్రభుత్వానికి పంపి, నియోజకవర్గాన్ని పంట నష్ట ప్రాంతంగా ప్రకటించాలని అన్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని, నష్టపోయిన ప్రతి రైతుకూ తగిన పంట నష్ట పరిహారాన్ని వెంటనే అందజేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేషన్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- బండి సంజయ్ సొంత కార్పొరేటర్లనే హెచ్చరించారు.. అవినీతిని అరికట్టడంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు: వైద్యుల అంజన్ కుమార్



కరీంనగర్, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతిపై సొంత కార్పొరేటర్లనే కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ హెచ్చరించడం ఆయన పాలనలోని పరిస్థితిని తెలియజేస్తోందని కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్ విమర్శించారు. కార్పొరేటర్లు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయని, బ్లాక్‌లిస్ట్‌లో పెడతానని బండి సంజయ్ చెప్పినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందిస్తూ, అవినీతి జరుగుతున్నట్లు తెలిసినప్పుడు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని, కార్పొరేషన్‌కు నిధులు తీసుకురావడంలోనూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇటీవల కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నగర సమస్యలు, నిధుల కొరత, ఉద్యోగ ఖాళీలపై వినతిపత్రం అందజేశామని, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. యూఐడీఎఫ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా 25 శాతం, రాష్ట్రం వాటా 25 శాతం కాగా, మిగిలిన 50 శాతానికి రాష్ట్ర ప్రభుత్వమే హామీ ఇస్తోందని వివరించారు. గత పాలకవర్గం హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవినీతిపైనా, ప్రస్తుత పాలకవర్గంలో జరుగుతున్న అవినీతిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతల జగన్‌రెడ్డి, చారకొండ బుచ్చిరెడ్డి, పడిశెట్టి భూమయ్య, కల్లపల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, కంకణాల అనిల్, ఇమ్రాన్, సత్రం శ్రీకాంత్, పహాడ్ పెంట శేఖర్, శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత దిశగా కీలక ముందడుగు

- నవంబర్ 28 లేదా 30న న్యూఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు.. పలు వామపక్ష పార్టీల సానుకూల స్పందన



న్యూఢిల్లీ, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక చేపట్టిన ప్రయత్నాలకు సానుకూల స్పందన లభించింది. ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ బి. చంద్రకుమార్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం నవంబర్ 2, 3 తేదీల్లో న్యూఢిల్లీలో పలు కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల జాతీయ నాయకులతో సమావేశమై ఐక్య కార్యాచరణపై చర్చించింది. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఈ ప్రయత్నాన్ని స్వాగతిస్తూ, తేదీ ఖరారైన తర్వాత సదస్సులో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) విముక్తి పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా సదస్సుకు హాజరయ్యేందుకు అంగీకరించారు. న్యూ డెమోక్రసీ, ఫార్వర్డ్ బ్లాక్, మాస్ లైన్ తదితర వామపక్ష పార్టీల నాయకులు సైతం ఐక్యతా ప్రయత్నానికి మద్దతు తెలిపారు. ఇతర వామపక్ష పార్టీలకు కూడా ప్రతిపాదనలు అందజేయగా సానుకూల స్పందన వచ్చినట్లు ఐక్యవేదిక వెల్లడించింది. రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు, వామపక్ష, అంబేద్కరిస్ట్, బహుజన, మైనారిటీ, సోషలిస్టు, ఇతర ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. భాగస్వామ్య సంస్థల స్వతంత్ర గుర్తింపును గౌరవిస్తూనే ఉమ్మడి ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడమే తమ లక్ష్యమని తెలిపింది. ఈ నేపథ్యంలో 2026 నవంబర్ 28 లేదా 30 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించింది. ఈ సదస్సుకు వామపక్ష పార్టీలతో పాటు అంబేద్కరిస్ట్, బహుజన, మైనారిటీ, ప్రజాతంత్ర సంస్థలు, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రగతిశీల మేధావులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది. మతతత్వం, నిరంకుశత్వం, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడి రాజ్యాంగాన్ని, దేశ భవిష్యత్తును కాపాడాలని పిలుపు నిచ్చింది. ఈ ప్రకటనను ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ బి. చంద్రకుమార్, సహ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్ దాస్, కమిటీ సభ్యులు కామ్రేడ్ బొజ్జా భిక్షమయ్య, ప్రొఫెసర్ మొహినొద్దీన్, అధ్యాపకుడు బండారి లక్ష్మయ్య, ప్రొఫెసర్ గొల్ల రమేష్ విడుదల చేశారు.

దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

- బాణసంచా విక్రయాలు, భద్రతా చర్యలపై అధికారుల సమీక్ష
- సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్యక్షతన సమన్వయ సమావేశం

కల్లూరు, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :దీపావళి పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ అన్నారు. పండుగ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో ఆయన అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బాణసంచా విక్రయాలకు అనుమతులు, తాత్కాలిక విక్రయ కేంద్రాల ఏర్పాటు, అగ్నిప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, అత్యవసర వైద్య సేవలపై మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని, లైసెన్సుదారులు భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పంజాల సర్వయ్య, సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, మండల తాసిల్దారులు కరుణాకర్ రెడ్డి, వీరభద్ర నాయక్, సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన పెంపొందించాలి

- వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి: కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



కల్లూరు, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాలల్లోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన కల్పించడంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీ ప్రణాళికతో సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, పోటీల నిర్వహణ, ప్రచారం, పర్యవేక్షణలో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్పష్టం చేశారు.

వార్డు సభ్యుల సంఘం మహిళా విభాగం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంచాల కవిత చందు నియామకం



గంగాధర నవంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ లో ఈరోజు ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రం అందజేసిన వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్. వార్డు సభ్యుల సంఘం కరీంనగర్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా మధురానగర్ గ్రామ 3వ వార్డు సభ్యులు పెంచాల కవిత చందు ను నియమిస్తూ వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ కరీంనగర్ కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని వార్డు సభ్యుల సంఘం ఇచ్చే పిలుపులలో పాల్గొనాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పబ్బ మహేష్ గౌడ్,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మూల కరుణాకర్ సంజీవ్, నాయకులు పేరుక గవాస్కర్, పోరండ్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.

హాఫీజ్ యూసుఫ్ కుటుంబానికి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పరామర్శ



కరీంనగర్, నవంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్): ఎంఐఎం పార్టీ శాసనసభ్యులు మాజీ హుస్సేన్ కరీంనగర్ పట్టణంలో పర్యటించారు ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకుడు శాసహాబ్ మొహల్లకు చెందిన హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ తల్లి అఫ్జలున్నిసా బేగం ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, ఫసియోద్దీన్ ఖలీద్, అహ్మద్ మొహియుద్దీన్ బాబు జానీ, అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, అబ్దుల్లాఖాన్, షాకిర్ నహ్ది, ఖమరొద్దీన్ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

తేజస్వి యాదవ్‌ను కలిసిన ఐఐపీ తెలంగాణ నాయకులు

- తాజ్ కృష్ణ హోటల్‌లో మర్రి ప్రభాకర్ ముదిరాజ్, చింతల నీలకంఠం ముదిరాజ్ భేటీ



హైదరాబాద్, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): ఆర్జేడీ జాతీయ అధ్యక్షుడు తేజస్వి యాదవ్‌ను హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఐఐపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల నీలకంఠం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున శాలువాతో తేజస్వి యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐఐపీ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తేజస్వి యాదవ్ ఆరా తీశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడంతో పాటు ఇండియా కూటమిని బలోపేతం చేసేందుకు ఐఐపీ గుప్తా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని నాయకులు వివరించారు. దీనిపై తేజస్వి యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ నాయకుల కృషిని అభినందించారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి కూటమి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

వరద నీటి ఉధృతితో పలు రహదారులు బంద్

- నీటి ప్రవాహాన్ని తక్కువ అంచనా వేసి ప్రయాణించొద్దు
- పోలీసులకు ప్రజలు సహకరించాలి: సీఐ తుమ్మలపల్లి శ్రీహరి





సత్తుపల్లి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :
సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరద నీటి ఉధృతి కారణంగా పలు రహదారులను పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో ఎంఆర్ గార్డెన్ సమీపంలో, కిష్టారం నుంచి యాతాలకుంట వెళ్లే రహదారి, రుద్రాక్షపల్లి నుంచి నాచారం వెళ్లే రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేసినట్లు సీఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు. ప్రజలు నీటి ప్రవాహాన్ని తక్కువ అంచనా వేసి రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు ప్రజలు సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలి

- 'ఉద్యమకారుల యాప్' వెంటనే ప్రారంభించాలి
- గన్ పార్క్ వద్ద టీయూ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



హైదరాబాద్, నవంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని విమర్శిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూ జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఎదుట గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు నిరసన ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘోర సంఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీయూ జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టీయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి రావడం అత్యంత విచారకరమన్నారు. లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ ఆయన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు మరియు వివరాల నమోదు కోసం 'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలని, రాబోయే డిసెంబర్ 9 నాటికి అర్హులైన ఉద్యమకారులందరికీ తెలంగాణ ఉద్యమ ఫలాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు అస్వర్ పటేల్, అనుముల రవీందర్, మోత్కూరు మల్లేష్, జి. యాదగిరి, రాజుగౌడ్, అంకం సతీష్, శ్రీశైలం, జాంబవ్, కృష్ణ, గిరి, రాజయ్య, అమరేందర్ గౌడ్, వి. అరుణ, లావణ్య, విజయలక్ష్మి, పుట్ట రంజిత్, అమృత్ తో పాటు పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

తుఫాను బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

- పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలి
- దళారుల నుంచి రైతాంగాన్ని కాపాడాలి
- సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి



కల్లూరు, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఇటీవల వచ్చిన అరనాబు, మురుసు తుఫాన్ల కారణంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకొని నష్టపరిహారం అందించాలని సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావంతో రైతాంగానికి జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కల్లూరు మండలంలోని చెన్నూరు, లింగాల, యజ్ఞనారాయణపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే రైతులు పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయలేకపోయారని, సాగు చేసిన కొద్దిపాటి పంటలు కూడా తుఫాను కారణంగా నేలపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేయించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా దళారుల నుంచి రైతాంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునరావు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సామినేని హనుమయ్య, ముదిగొండ అంజయ్య, రైతులు ముంత మాధవరావు, మండేపూడి చిన్న నాసరయ్య, మోదుగు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

- బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పణ జరిగింది
- సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్





మానకొండూర్, నవంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మానకొండూర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను, ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. 8,9,10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ ఎంఐఎం పార్టీ ప్రతినిధులకు, ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గైడ్స్ అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతివార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 26 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరఫున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో కలిసికట్టుగా అనేకమైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దారుస్సలాం ఏర్పాటు చేసి, ప్రజా సమస్యల ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం అభినందనీయమన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ చేస్తున్న ప్రజా సేవలను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలనే సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 20పాఠశాలలను స్థాపించి, 20వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత, చెడు వ్యసనాలను మాని, ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సాలారే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, అబ్దుల్లా ఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, షాకిర్ నహ్దీ, సిరిసిల్ల నాయకులు పర్వేజ్, ముస్తఫా, ఇర్ఫాన్ ఖాన్, మానకొండూర్ మస్జిద్ మాజీ అధ్యక్షుడు సిరాజుద్దీన్ పాషా, ఖమరొద్దీన్ షబ్బీర్, ఎజాజ్ ఖురేషీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు కాదు.. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుంది
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ నవంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుత పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. అధికార పక్షం, ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు.**బండి సంజయ్‌కు సూటి ప్రశ్న**నరమాంసం తినే అలవాటు ఉన్నవారిని సాధువులుగా మారమంటే సాధ్యమవుతుందా? అంటూ బండి సంజయ్‌ను ఉద్దేశించి ఘాటుగా ప్రశ్నించారు. ఒకవైపు అవినీతి ఆరోపణలు చేస్తూ, మరోవైపు రాజకీయ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం ప్రజలకు ఏం ప్రయోజనం చేకూరుస్తుందని ప్రశ్నించారు.బీఆర్ఎస్ నాయకుల వద్ద అవినీతికి సంబంధించిన ఆధారాలు, రికార్డులు ఉంటే వాటిని బయటపెట్టి సంబంధిత అధికారులకు ఎందుకు అందజేయడం లేదని ప్రశ్నించారు. ఆరోపణలు చేసుకోవడం కంటే ఆధారాలను ప్రజల ముందు ఉంచి, విచారణకు సహకరించాలని సూచించారు.**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం కావాలి** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డంప్‌యార్డు సమస్య పరిష్కారం, విలీన గ్రామాల అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణం, మెరుగైన పౌర సేవల కల్పన వంటి అంశాలపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు, చిల్లర గొడవలతో కాలం గడపకుండా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. **రెండు పార్టీల వ్యవహారాలను బయటపెడతాం**ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యవహారాలను కాంగ్రెస్ పార్టీ ఇకపై చూస్తూ ఊరుకోదని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన ఆధారాలతో రెండు పార్టీల వ్యవహారాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

ప్రశ్నించడమే కాదు... ప్రజా సమస్యల పరిష్కారంలో 'ప్రజావాణి' ముందు చూపు!



- అధికారుల దాకా ఎందుకు? 'ప్రజావాణి' సంస్థ శ్రమదానం... ప్రభుత్వ దవాఖానా పైకప్పు శుభ్రం!
- వెంకట్ రెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 'ప్రజావాణి' బృందం శ్రమదానం... సేవా నిరతికి ప్రశంసలు!



ఉప్పల్ నవంబర్ 04 (పి సి డబ్ల్యూ న్యూస్): సమాజంలో సమస్యలను వేలెత్తి చూపడమే కాకుండా, తమ వంతు బాధ్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన సామాజిక బాధ్యత అని 'ప్రజావాణి' స్వచ్ఛంద సంస్థ నిరూపించింది. మంగళ వారం వెంకట్ రెడ్డి నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ బృందం సందర్శించింది. దవాఖానాలోని పరిస్థితులను పరిశీలించిన క్రమంలో అపరిశుభ్రంగా ఉన్న పైకప్పు ను గుర్తించారు. కేవలం అధికారులకు విన్నపాలు చేసి వదిలేయకుండా, డాక్టర్ సురేష్ రెడ్డితో కలిసి ప్రజావాణి సంస్థ బృందం వెంటనే రంగంలోకి దిగి శ్రమదానం ద్వారా ఆ పైకప్పును శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణి సంస్థ నాయకులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న ఇతర సమస్యలను కూడా తమ సంస్థ తరఫున ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ శ్రమదానంలో ఆర్తో డాక్టర్ సురేష్ రెడ్డి, ప్రజావాణి సంస్థ ప్రతినిధులు వంపు లక్ష్మయ్య, విజయ్ కుమార్, తెడ్డు రవీందర్ రావు పాల్గొన్నారు.

గల్లీ నాయకులు కనీసం సర్పంచులు కూడా కాలేదుగా.?

వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్ష పదవిపై తీవ్ర ఉత్కంఠ.. ఎవరికి దక్కేను పీఠం.?

పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కాదని ఎంపీ ఈటల వద్ద పైరవీలంటూ పార్టీలో చర్చ

గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు పునుక్కునే నాయకులకు భయమెందుకు.?

హైదరాబాద్ అక్టోబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్): ఉప్పల్ నియోజకవర్గంలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బీజేపీలో అధ్యక్ష పదవి వ్యవహారం రాజకీయ వేడిని రాజేస్తోంది. డివిజన్ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు నేతలు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ స్థానిక కార్యకర్తల్లో నెలకొంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన వారిని పక్కనపెట్టి, పలుకుబడి, పైరవీలతో పదవులు దక్కించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌ను సంప్రదించకుండా, ఆయన ప్రాధాన్యతను పక్కనపెట్టి నేరుగా ఎంపీ ఈటల రాజేందర్ వద్ద పైరవీలు సాగిస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక గల్లీ స్థాయి నాయకుడు స్థానిక మాజీ ఎమ్మెల్యే నాయకత్వాన్ని పక్కనపెట్టి తన పలుకుబడిని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానమంత్రి మోడీ కూడా గల్లీ నాయకుడు గా ఎదిగే ప్రధాని అయ్యారని కొంతమంది నాయకులు అనడం సంతోషమే. అయితే చాలామంది గల్లీ నాయకులు కనీసం సర్పంచులు కూడా కాలేదు మరి దానిపై ఏమి సమాధానమిస్తారో.? బిజెపి పార్టీ క్రమశిక్షణ పార్టీని కానీ అందులో ఉన్న కొంత మంది నాయకుల వ్యవహారమే ఎవరికి అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్న దానిపై పత్రికలలో కథనం వచ్చింది దానికి గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు పునుక్కోవడం ఎందుకో ఆ నాయకులకే తెలియాలి. గత అసెంబ్లీ ఎన్నికలలో ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఎమ్మెల్యే పోటీలలో ఉన్నప్పుడు బిజెపి కొంతమంది నాయకులు అంతర్గతంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపొందడానికి సహకరించారని



బిజెపి నాయకులు చర్చించుకున్న సంగతి వాళ్లకు తెలియకపోవడం వల్ల విజ్ఞతకే తెలియాలి. **పార్టీకి పనిచేసిన వారిని పక్కనపెడతారా.?** పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా, ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి బీఆర్ఎస్ పార్టీకి పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పైరవీలకు తలొంచి పదవులు కట్టబెడితే క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం తప్పదని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారికి కాకుండా పైరవీలు చేసేవారికి పదవులు దక్కితే కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పార్టీ లో అంతర్గత వ్యవహారాలను కొంతమంది అగ్ర నాయకులకు తెలియనియకుండా చేసే కుట్ర కుతంత్రాలను బయటపెట్టేదే జర్నలిజం అంతేకానీ ఎంతోమంది నాయకులు పార్టీ పేరు చెప్పుకొని అనేక అక్రమ కార్యక్రమాలకు పాల్పడుతున్న విషయం ప్రజలకు అందరికీ తెలిసిందే. **పదవి వెనుక అసలు ప్రయోజనాలేమిటి.?** ఈటల రాజేందర్ పేరు ఉపయోగించుకొని రాజకీయ పలుకుబడిని పెంచుకోవడంతో పాటు, అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు కూడా స్థానిక నాయకులలో వినిపిస్తున్నాయి. చెట్టు పేరు చెప్పుకొని కాయాలు అమ్ముకునే వాళ్ళు ఎంతోమంది ఉన్నారు అలాగే ఎమ్మెల్యే, ఎంపీల వెంట తిరుగుతూ వాళ్ళ సొంత వ్యవహారాలు చేసుకునే ఎంతోమంది నాయకులు ప్రతి పార్టీలో ఉన్నారు. బీజేపీ అధిష్ఠానం ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పైరవీలకు ప్రాధాన్యత ఇస్తారా.? పార్టీ కోసం పోరాడిన వారికి పట్టం కడతారా.? అన్నది వేచి చూడాల్సిందే.

జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా విశ్రాంత ఈపీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం



హైదరాబాద్, నవంబర్ 04(పి సి డబ్ల్యూ న్యూస్): కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ల కింద, కేంద్ర కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి అధ్యక్షతన నూతనంగా ఏర్పాటైన 'జాతీయ సామాజిక భద్రతా బోర్డు' సభ్యుడిగా రిటైర్డ్ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం నియమితులయ్యారు. సామాజిక భద్రత, ఈపీఎఫ్ రంగాలు మరియు కార్మిక సంక్షేమ అంశాలలో ఆయనకున్న అపారమైన అనుభవం, నైపుణ్యానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. శ్రీనివాస్ జాలిగం జాతీయ బోర్డు సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణారావు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా బరకత్‌పురలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ.. సరైన వ్యక్తికి సరైన స్థానంలో అర్హత లభించిందని కొనియాడారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, వారి సామాజిక భద్రతపై శ్రీనివాస్ జాలిగంకు సుదీర్ఘ అనుభవం, స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. జాతీయ బోర్డులో ఆయన ప్రాతినిధ్యం వహించడం వల్ల అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇది దేశంలోని లక్షలాది మంది అసంఘటిత కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యవసాయ పనిముట్ల దొంగల ముఠా గుట్టురట్టు

- రూ.6.50 లక్షల విలువైన చోరీ సొత్తు, రెండు మినీ వ్యాన్లు స్వాధీనం.. ఎనిమిది కేసుల్లో నిందితులు

పెనుబల్లి, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): రైతుల పొలాల్లో వ్యవసాయ పనిముట్లను దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ. 6.50 లక్షల విలువైన ఫుల్ వీల్స్, ఇతర వ్యవసాయ సామగ్రితో పాటు చోరీలకు ఉపయోగించిన రెండు మినీ వ్యాన్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ పంజాల సర్వయ్య తెలిపారు. వి.యం. బంజర ఎస్సై ఎస్.కె. షకీర్ సిబ్బందితో కలిసి ముత్తగూడెం సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా, గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి కింద అనుమానాస్పదంగా ఉన్న రెండు మినీ వ్యాన్లను తనిఖీ చేశారు. విచారణలో రైతుల పొలాల నుంచి వ్యవసాయ పనిముట్లు దొంగిలించి, విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ ముఠా వేంసూరు పరిధిలో రెండు, వి.యం. బంజర పరిధిలో ఆరు.. మొత్తం ఎనిమిది







దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పంతంగి చెన్న కేశవ్, కుంట రాఘవేంద్ర, మేకల గోవర్ధన్, పుచ్చి ముత్తయ్య, మురళీ గౌతమ్, గోపిన నవీన్‌లను నిందితులుగా గుర్తించగా, ఎస్.కె. మస్తాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన నిందితులను సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. కేసులను ఛేదించిన సీఐ పంజాల సర్వయ్య, ఎస్సైలు ఎస్.కె. షకీర్, ప్రదీప్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతిపై ఎస్‌డబ్ల్యూయూ సంతాపం

-మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి.. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి: గొడిశాల అబ్రహం



హైదరాబాద్, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిశాల అబ్రహం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో యూనియన్ కార్యాలయం వద్ద ప్రవళిక మృతికి సంతాప సభ నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రవళికను బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ కిందకు తోసివేయడంతో తీవ్రంగా గాయపడిందని, గత పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3న రాత్రి మృతి చెందిందని తెలిపారు. మహిళా ఉద్యోగిపై ఇటువంటి దాడి జరగడం బాధాకరమని, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు యూనియన్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సయ్యద్ మహమూద్, బి. హనుమంతరావు, చంద్రయ్య, విజయబాబు, ఛాయాదేవి, శాంతకుమారి, జయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల ముసుగులో భారీ జూదం.. 156 మంది అరెస్ట్!



- రూ.20.01 లక్షల నగదు, 47 కార్లు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం

బీజాపూర్, నవంబర్ 4 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా రాయగూడ అటవీ ప్రాంతంలో కోడిపందాల ముసుగులో నిర్వహిస్తున్న అక్రమ జూదంపై పోలీసులు భారీ దాడి నిర్వహించారు. ఈ ఘటనలో జూదంలో పాల్గొన్న 156 మందిపై పోలీసులు చట్టపరమైన చర్యలు



చేపట్టారు. వారి నుంచి రూ.20,01,200 నగదు, 47 నాలుగు చక్రాల వాహనాలు, 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. భద్రకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయగూడ అటవీ గ్రామంలో కోడిపుంజుల మార్కెట్ పేరుతో భారీగా జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అదనపు ఎస్పీ రాహుల్ బస్సల్ నేతృత్వంలో, జిల్లా ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా మార్గదర్శకత్వంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రాంతాన్ని దిగ్బంధించి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 156 మందిని అదుపులోకి తీసుకుని, భద్రకాళి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 06/2026 కింద ఛత్తీస్‌గఢ్ జూదం నిషేధ చట్టంలోని సెక్షన్ 3(2), పబ్లిక్ జూదం చట్టంలోని సెక్షన్లు 4, 13 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 20.01 లక్షల నగదు, 47 నాలుగు చక్రాల వాహనాలు, 12 మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

సగర కులాన్ని బీసీ-ఎలో చేర్చాలి

- మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేత



హైదరాబాద్, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): సగర (ఉప్పర) కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చాలని తెలంగాణ సగర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సగర ఫెడరేషన్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, నిర్మాణ కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా, యువతకు ఉపాధి రుణాలు, ప్రభుత్వ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సగర నాయకులు పాల్గొన్నారు.

జల సంరక్షణకు బోర్‌వెల్ రీఛార్జ్ పనులు



- దేవనగర్ గ్రామపంచాయతీలో సోక్‌పిట్ నిర్మాణ పనులకు శ్రీకారం

మల్లంపల్లి నవంబర్ 4 (పి.సి.డబ్ల్యూ న్యూస్): దేవనగర్ గ్రామపంచాయతీలో వివిజి రాంజీ పథకం కింద జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ సలుగు



సంతోష్ అధ్యక్షతన, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బోర్‌వెల్ రీఛార్జ్, కమ్యూనిటీ సోక్‌పిట్లు, వ్యక్తిగత సోక్‌పిట్ల నిర్మాణ పనులకు ముగ్గు పోశారు. గ్రామంలో వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి నివారణకు, బోర్లు, బావుల్లో నీటి నిల్వలు పెరగడానికి ఈ నిర్మాణాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై అవగాహన పెంచుకుని ఇలాంటి కార్యక్రమాలకు సహకరించా లని సూచించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఎఫ్ఏ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాసన మండలిలో పట్టభద్రుల గొంతుకగా బీఆర్ఎస్

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి: మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి





ములుగు, నవంబర్ 4 (పి.సి.డబ్ల్యూ న్యూస్): విద్యాధికులు, పట్టభద్రులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అధ్యక్షతన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫారం-18 ద్వారా ఓటరు నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియను ఉద్యమంలా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని, ప్రతి అర్హుడైన డిగ్రీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని కోరారు. పట్టభద్రులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపించేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, భూక్య జంపన్న, కాకులమర్రి ప్రదీప్ రావు, విజయ్, కోగిల మహేష్, వేణు యాదవ్, సూరయ్య, శ్రీనివాస్ రెడ్డి, మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాలేపు శ్రీనివాస్, వెంకన్న, బుల్లెట్టు ఓదెలు, అమర్ సింగ్, జాకారం సర్పంచ్ రమేష్, నూతన కౌన్సిలర్లు, కోకిల లక్ష్మి, కవ్వంపల్లి బాబు, భూక్య మురళి, పుమా నాయక్, గోపాల్ రెడ్డి, నర్ర భద్రయ్య, చంటి భద్రయ్య, వీరమల్లు తదితరులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఎన్నికైన మహిళా కార్పొరేటర్ స్థానంలో భర్త పెత్తనమా?

● పడిశెట్టి భూమయ్యపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బీజేపీ నాయకురాలు బండారి గాయత్రీ ఫిర్యాదు



కరీంనగర్, నవంబర్ 04 (పీసీడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రజాప్రతినిధులను చిన్నచూపు చూస్తోందని బీజేపీ నాయకురాలు బండారి గాయత్రీ ఆరోపించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ నుంచి ఎన్నికైన కార్పొరేటర్ పడిశెట్టి వసంతలక్ష్మి స్థానంలో ఆమె భర్త పడిశెట్టి భూమయ్య కార్పొరేటర్‌గా చెలామణి అవుతూ, మున్సిపల్ పాలనలో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎలాంటి అధికారిక పదవి లేని భూమయ్య కార్పొరేటర్‌గా ప్రచారం చేసుకుంటూ, మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధికి దక్కాల్సిన గౌరవం, హక్కులను ఆమె భర్త ఆక్రమించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.భూమయ్యను కార్పొరేటర్‌గా గుర్తించవద్దని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని, పాలనలో ఆయన అనధికారిక జోక్యాన్ని అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండారి గాయత్రీ అధికారులను కోరారు.

అభివృద్ధి దిశగా జేడీ మల్లంపల్లి మండలం అడుగులు!

- మంత్రి సీతక్క చొరవతో మారనున్న మండల రూపురేఖలు.. గ్రామాల్లో అభివృద్ధి పనుల జోరు



జేడీ మల్లంపల్లి, నవంబర్ 4 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పాటైన జేడీ మల్లంపల్లి మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక చొరవతో మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు అడుగులు పడుతున్నాయి. దశాబ్ద కాలంగా స్థానిక ప్రజలు కోరుతున్న మండల కలను సాకారం చేయడంతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయించడం, దివంగత మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ సేవలను గుర్తిస్తూ మండలానికి జేడీ మల్లంపల్లిగా నామకరణం చేయడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలో రూ. 32.41 కోట్లతో 689 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఇందులో మల్లంపల్లి మండలంలోని మల్లంపల్లి, జాకారం, బండారుపల్లి, శ్రీనగర్, మహ్మద్ గౌస్ పల్లి, పందికుంట, శివతండా, రాంచంద్రాపురం తదితర గ్రామాలకు అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. నూతన గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సైడ్ కాల్వలు, కూరగాయల మార్కెట్లు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద డ్రైనేజీ పనులు, మహిళా శక్తి ఉపాధి భరోసా కింద పశువులు, మేకల షెడ్లు కూడా మంజూరయ్యాయి.మరోవైపు మండల ప్రజల చిరకాల సమస్య అయిన తాగునీటి ఎద్దడికి పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రామప్ప సరస్సు నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాలకు సురక్షిత తాగునీరు అందించే ప్రతిపాదనపై దృష్టి సారించారు. గోదావరి నీటిని రామప్ప సరస్సుకు తరలించే అంశం కూడా పరిశీలనలో ఉంది.ఇక రాంచంద్రాపురంలో నిర్వహించిన ప్రజాదర్బార్ ద్వారా 30 నుంచి 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 10,600 ఎకరాల భూముల పట్టాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం రైతుల్లో ఆశలు నింపుతోంది. మండలంలో రోడ్లు, తాగునీరు, విద్య, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు మెరుగుపడితే గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండల సాధన సమితి నాయకులు మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో మల్లంపల్లికి ప్రత్యేక మండల హోదా రావడమే కాకుండా అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అన్ని గ్రామాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందాలని వారు ఆకాంక్షించారు.

రిస్క్ టీం బోటు బోల్తా...

- బోట్లు తిరగబడి 10 మంది కానిస్టేబుళ్లు గల్లంతు

సత్తుపల్లి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) : మండలంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన 10 మంది పోలీస్ కానిస్టేబుళ్లు ప్రయాణిస్తున్న రెండు ఎస్‌డీఆర్ఎఫ్ బోట్లు తిరగబడటంతో వారంతా చెరువులో గల్లంతయ్యారు.బేతుపల్లి చెరువులో ఐదుగురు మత్స్యకారులు ప్రమాదవశాత్తు చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు 10 మంది పోలీస్ కానిస్టేబుళ్లు రెండు బోట్లలో చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలోనే నీటి ప్రవాహం, గాలి ధాటికి రెండు బోట్లు కూడా ఒక్కసారిగా నీటిలో తిరగబడ్డాయి.దీంతో బోట్లలో ఉన్న 10 మంది కానిస్టేబుళ్లు చెరువు నీటిలో మునిగిపోయి గల్లంతయ్యారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు, రెస్క్యూ సిబ్బంది, గజ ఈతగాళ్లు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. గల్లంతైన కానిస్టేబుళ్ల కోసం చెరువులో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజలు, అధికారులు చెరువు గట్టుపై ఉండి ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి తాసిల్దార్ ఎన్ రవి, సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ఐలు వీరప్రసాద్, గద్దల అశోక్ సహాయక చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి..

● కొత్తూరు(సి)సర్పంచ్ బాదావతు చిన్ని ఆదేశం





కురవి,నవంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్) : మహబుబాబాదు జిల్లా కురవి మండలం కొత్తూరు(సి) గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండే మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ బాదావతు చిన్ని, సీరోలు మండల విద్యాశాఖాధికారి ఇస్లావత్ లచ్చిరాం నాయక్ తో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాలలో వండుతున్న అన్నం, కూరలను స్వయంగా పరిశీలించిన సర్పంచ్, విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, బియ్యం, కూరగాయల నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవల గురించి అంగన్‌వాడీ టీచర్ కోండ్లే శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రికార్డుల నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగం మనోహర్, అంగన్‌వాడీ టీచర్ కోండ్లే శ్రీదేవి, ఆయా మైల అమృతమ్మ, ఉపాధ్యాయులు వీరన్న. ఉపేందర్. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు పాల్గొన్నారు.

వేశ్యకాంతల ఆయకట్టుకు జలగండం!



వరద ఉధృతిలోకి దిగి బాధితులకు అండగా ఎమ్మెల్యే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల రెండో అంతస్తు వరకు వరద నడుములోతు నీటిలో పర్యటన.. రాత్రంతా సహాయక చర్యల పర్యవేక్షణ



సత్తుపల్లి, నవంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్) : వేశ్యకాంతల చెరువు వరద ఉధృతి సత్తుపల్లిలో కలకలం రేపింది. చెరువు కట్టపై నుంచి పొంగిపొర్లుతున్న నీరు దిగువ ప్రాంతాలను ముంచెత్తడంతో వేశ్యకాంతల ఆయకట్టు ప్రమాదంలో పడింది. సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ నివాస సముదాయాల్లో రెండో అంతస్తు వరకు వరద నీరు చేరడంతో పరిస్థితి భయానకంగా మారింది. పంట పొలాలు నీటమునిగాయి. ఇళ్లను వరద చుట్టుముట్టడంతో కుటుంబాలు ప్రాణభయంతో రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశాయి.**వరద వస్తుందని వెనక్కి తగ్గలేదు.. బాధితులున్న చోటుకే వెళ్లారు!**పరిస్థితి తీవ్రత తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నేరుగా వరద ప్రాంతానికి చేరుకున్నారు. నడుములోతు నీటిలోకి దిగి బాధితుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తూ రక్షణ చర్యలను వేగవంతం చేశారు.**ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యం..**వరదలో చిక్కుకున్న కుటుంబాలను బయటకు తీసుకొచ్చేందుకు లారీలు, ట్రాక్టర్లను రంగంలోకి దించారు. పార్టీ శ్రేణులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. వరద ఉధృతి నిమిషనిమిషానికి పెరుగుతున్న నేపథ్యంలో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన కొనసాగించారు. **రాత్రంతా అక్కడే.. బాధితుల కోసమే నిరీక్షణ!**వరదలో చిక్కుకున్న కుటుంబాల ఆర్తనాదాల మధ్య ఎమ్మెల్యే రాత్రంతా డబుల్ బెడ్‌రూమ్ నివాసాల సమీపంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రతి కుటుంబాన్ని సురక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో నిలిచారు. ఒకవైపు ఉప్పొంగుతున్న వరద.. మరోవైపు ప్రాణభయంతో ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలు.. ఈ విపత్కర పరిస్థితుల్లో ఎమ్మెల్యే స్వయంగా వరదలోకి దిగి సహాయక చర్యలకు నాయకత్వం వహించడం అక్కడి పరిస్థితి తీవ్రతను తెలియజేసింది.

అభివృద్ధి దిశగా మల్లంపల్లి మండలం

- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు: కాంగ్రెస్ పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి ఎడ్ల అనిల్ రెడ్డి



మల్లంపల్లి, నవంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్): మల్లంపల్లి మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి ఎడ్ల అనిల్ రెడ్డి అన్నారు. మంత్రి సీతక్క ఆధ్వర్యంలో మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు.ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, వీటితో పరిపాలన ప్రజలకు మరింత చేరువవుతుందని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్య రంగాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించి, మల్లంపల్లిని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎడ్ల అనిల్ రెడ్డి అన్నారు.

జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు
ఎంపికైన గౌతమి విద్యార్థిని



ప్రొద్దుటూరు నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రొద్దుటూరు గౌతమి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఫర్ ఉమెన్ (అటానమస్) కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె అమృత లక్ష్మి ఈఈఈ విద్యార్థిని జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ నెల 9 నుం డి 12 వరకు హైదరాబాద్ లో జరిగే అంతర్ విశ్వవిద్యా లయాల సౌత్ జోన్ చెస్ పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్లు సి. నాగూర్, బి. రవీంద్రా రెడ్డి, కరస్పాం డెంట్ కె.సి. బాబమ్మ, డైరెక్టర్ సి. శైలూష, ప్రిన్సిపాల్ డా. ఎం. రామ సుబ్బమ్మ, ఫిజికల్ డైరెక్టర్ జి. ఓబయ్య మరియు జి. ప్రవల్లిక విద్యా ర్థినిని అభినందించారు.విద్యార్థినులు విద్య తో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మం చి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

కూటమి విజయోత్సవ సమావేశం



కడప నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): కడప నగర పాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టించి, మేయర్‌గా మట్టి సువర్ణ రికార్డు మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విజయోత్సవ సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కడప శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన మేయర్ మట్టి సువర్ణ తో పాటు కార్పొరేటర్లు, కూటమి ముఖ్య నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కడప నగరంలో దశాబ్దాల రాజకీయ చరిత్రను తిరగరాస్తూ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు చారిత్రాత్మకమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లోనూ నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని గెలిచిన ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కడపను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో రాత్రింబవళ్లు శ్రమించి కూటమి విజయానికి వెన్నెముకగా నిలిచిన ప్రతి కార్యకర్తను, నాయకుడిని ఈసందర్భంగా ప్రశంసించారు.కార్యక్రమం ముగిసిన అనంతరం, విజేతలుగా నిలిచిన ప్రజాప్రతినిధులు మరియు కూటమి ముఖ్య నేతలతో కలిసి క్యాంప్ కార్యా లయంలో ఆత్మీయ విందు నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ఇన్చార్జిలు పాల్గొన్నారు.

చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన
సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్



సైబరాబాద్ నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నం చెరువు మరియు తమ్మిడికుంట చెరువులను స్వయంగా సందర్శించి పరిశీలించారు.ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోన్ డి.సి.పి రితిరాజ్, ఐ.పి.ఎస్, మాదాపూర్ డివిజన్ ఎసిపి సిహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, పి. రమేష్ మరియు ఇతర ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూసుకోవాలని, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా మరియు సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత పోలీసు సిబ్బందికి మరియు అధికారులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తగిన ఆదేశాలు జారీ చేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

- పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు మంత్రి కందుల దుర్గేష్ భరోసా



నిడదవోలు, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): 'మురసు' తుఫాన్ ప్రభావంతో నిడదవోలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులు పడుతున్న 50 కుటుంబాలకు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధితులకు ధైర్యం చెప్పారు. వర్షాలు తగ్గే వరకు పునరావాస కేంద్రంలోనే ఉండాలని, అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చారు.గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలోని ఆర్ఓబీ కింద ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు చేరి వ్యాపారుల స్టాక్ దెబ్బతినడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు ఎత్తుగా ఉండటంతో నీరు దుకాణాల్లోకి చేరుతోందని వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ లైటింగ్ సమస్యను కూడా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడతామని పేర్కొన్నారు.

బెతుపల్లి చెరువు వద్ద సహాయక చర్యల పర్యవేక్షణ





భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అప్రమత్తమైన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

ప్రజల భద్రతకు ప్రాధాన్యం.. అధికారులకు ముందస్తు జాగ్రత్తలపై ఆదేశాలు

సత్తుపల్లి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బెతుపల్లి చెరువు వద్ద చేపట్టిన రక్షణ, సహాయక చర్యలను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని బెతుపల్లి చెరువు వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రక్షణ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

లింగాల జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

19 గ్రామ పంచాయతీల్లో 33 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు 200 మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు





లింగాల నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం జరగనున్న లింగాల జడ్పీటీసీ స్థానానికి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి సువాసిని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సామగ్రిని అందజేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్వో సువాసిని వెల్లడించారు. **ఎన్నికల నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు...**లింగాల జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్దమల శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ తరఫున వై. సరళాదేవి పోటీలో ఉన్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఇరు పార్టీలకు బలమైన కార్యకర్తల బలం ఉండటంతో ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ నచికేతన్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీ నాయక్, సీఐ శాంతిలాల్ పర్యవేక్షణలో ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతో పాటు అదనంగా సుమారు 200 మంది పోలీసు సిబ్బంది, పది మంది సీఐలు, ఎస్ఐలను ఎన్నికల విధులకు కేటాయించారు.**గ్రామాల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాలు..**ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. గ్రామసభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు, హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా కల్పించారు. **పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది...** గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సామగ్రితో పాటు విధుల్లో పాల్గొనే సిబ్బందిని బుధవారం రాత్రి పోలీసుల పర్యవేక్షణలో అత్యంత భద్రత మధ్య సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అన్ని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడంతో గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానుంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన
జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి.



కర్నూలు నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి పోలింగ్ సిబ్బందికి సూచించారు.బుధవారం ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సి. బెళగల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోడుమూరు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు నిర్దిష్ట సమయానికి చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేయాలని, బస్సులు, ఇతర వాహనాల ద్వారా సిబ్బంది సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైనా, ముఖ్యమైన సమాచారం లేదా మార్పులు చోటుచేసుకున్నా వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు కంట్రోల్ రూమ్ సిబ్బంది తక్షణమే స్పందించి, అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు. రూట్ ఆఫీసర్లు తమకు కేటాయించిన పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సమాన దూరం ఉండేలా రూట్‌లను సమన్వయం చేసుకోవాలని, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మైనింగ్ శాఖ అధికారి నాగిని, సివిల్ సప్లై డి. ఎం జయంతి, సి. బెలగల్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, గూడూరు మండలం తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీలకు కీలక అవకాశం!

సూపర్‌స్టార్ సరసన తొలిసారి.. ప్రత్యేక గ్లింప్స్‌తో పరిచయం చేసిన చిత్రబృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్'లో యువ కథానాయిక శ్రీలీల చేరారు. ఈ విషయాన్ని ప్రముఖ నటుడు, నిర్మాత కమల్‌హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. శ్రీలీలకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'ఆమెలో ప్రత్యేకమైన మెరుపు ఉంది.. అద్భుతమైన ఉత్సాహం ఉంది' అంటూ చిత్రబృందం ఆమెను పరిచయం చేసింది. ఈ చిత్రంలో శ్రీలీల పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.రజనీకాంత్, శ్రీలీల కలిసి నటించడం ఇదే తొలిసారి. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' చిత్రాలతో గుర్తింపు పొందిన అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రంలో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఆయన పాత్రలో మరో కోణం కూడా ఉంటుందని ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆసక్తిని పెంచుతున్నాయి. వైద్యుడిగా ఉంటూనే నేరగాళ్లపై పోరాడే పాత్రలో సూపర్‌స్టార్ కనిపించనున్నట్లు సమాచారం.ఈ సినిమాలో నయనతార, సిమ్రన్, రాశీఖన్నా, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. నికేత్ బొమ్మి ఛాయాగ్రహణం, ప్రదీప్ ఈ రాఘవ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఇప్పటికే మూడు విడతల చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ధర్మన్' ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌కు చేరుకుంటోంది. ఈ చిత్రానికి విడుదల తేదీని నిర్మాతలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. శ్రీలీల చేరికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



పెద్దలు కూడా పిల్లల్లా ఎంజాయ్ చేస్తారు!

నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు 'సమ్మర్ హాలిడేస్'.. ప్రీ రిలీజ్ వేడుకలో చిత్రబృందం

పిల్లలతో పాటు పెద్దలను కూడా తమ బాల్య జ్ఞాపకాలలోకి తీసుకెళ్లే కథాంశంతో రూపొందిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తన సొంత నిర్మాణ సంస్థ ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వం వహిస్తుండగా, మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నటి జయసుధ మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను అమ్మమ్మ పాత్రలో నటించానని తెలిపారు. ఇది కేవలం పిల్లల సినిమా కాదని, తల్లిదండ్రులు, అమ్మమ్మ, వేసవి సెలవుల నేపథ్యంలో అందరికీ అనుబంధం కలిగించే కథ అని చెప్పారు. ఇలాంటి మంచి చిత్రాలను నిర్మాత ధీరజ్ మరిన్ని నిర్మించాలని ఆకాంక్షించారు.



'కింగ్ 100'లో మహంతి ఝాన్సీ రాణిగా టబు!


- 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు కలిసి నటిస్తున్న చిత్రం.. డిసెంబర్ 24న విడుదల

అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'కింగ్ 100'లో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది.నటి టబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె లిలిమహంతి ఝాన్సీ రాణిలిలిగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. 'ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. లక్‌ను నమ్మేవాళ్లు ఒకరు.. కష్టాన్ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ హేట్ లక్' అనే డైలాగ్‌తో ఆమె పాత్రను పరిచయం చేశారు.దాదాపు 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు మరోసారి వెండితెరపై కలిసి నటిస్తున్నారు. గతంలో ప్రేమకథల్లో అలరించిన ఈ జంట ఈసారి యుద్ధ నేపథ్యంతో సాగే కథలో కనిపించనుండటం విశేషం. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

రూ.వెయ్యి కోట్ల డీల్‌తో 'ఇట్లు అర్జున' ట్రైలర్ ఆసక్తికరం!

- ఎన్టీఆర్ విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్.. నవంబర్ 13న సినిమా ప్రేక్షకుల ముందుకు





అక్కినేని నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న 'ఇట్లు అర్జున' చిత్రంతో కొత్త హీరో అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను యంగ్ టైగర్ ఎన్టీఆర్ విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ట్రైలర్ పోలీసుల వేటతో ప్రారంభమవుతుంది. ఓ దొంగను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా, అర్జున్ అనే మూగ యువకుడు కథలోకి ప్రవేశిస్తాడు. మాట్లాడలేకపోయినా అసాధారణ తెలివితేటలు కలిగిన అర్జున్.. కీర్తిని ప్రేమిస్తుంటాడు. అయితే అనూహ్యంగా ఈ జంట ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. పోలీసులు, గూండాల ముఠా వారి కోసం గాలిస్తుంటారు.ఓ మిస్టరీ పెన్‌డ్రైవ్, దాని వెనుక ఉన్న రూ.వెయ్యి కోట్ల డీల్ కథలో ఉత్కంఠను పెంచుతున్నాయి. తొలి సినిమాతోనే భిన్నమైన కథను ఎంచుకున్న అనీష్‌ను ఎన్టీఆర్ అభినందించారు. ఈ చిత్రం నవంబర్ 13న విడుదల కానుంది.

ధనుష్ 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల హక్కులు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు!

నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు చిత్రం.. భారీ తారాగణంతో యాక్షన్ డ్రామా



తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల బాధ్యతలను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ దక్కించుకుంది. నిర్మాత నాగవంశీ ఆధ్వర్యంలోని ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సినిమాను విడుదల చేయనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అమరన్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ పెరియసామి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్‌తో పాటు మలయాళ స్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్నారు. సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలుగా కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అడవుల్లో ఎర్రచందనం కోసం పనిచేసే కూలీలు, పోలీసుల మధ్య చోటుచేసుకునే పరిణామాలు కథలో ప్రధానంగా ఉండనున్నాయి. ధనుష్ ఇందులో ఎర్ర చందనం కూలీ పాత్రలో కనిపించనున్నారు. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తెలుగు రాష్ట్రాల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల బాధ్యత లు చేపట్టడంతో సినిమాకు భారీ స్థాయిలో థియేటర్లు లభించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.